సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 26 । నవంబర్ । 2023



నిరంతర సాధనతోనే విజయం
ప్రణాళిక, నిరంతర సాధనతోనే గ్రూప్స్‌లో విజయం సాధించవచ్చని హైదరాబాద్ సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలా లత అన్నారు. 8లో ▸



మామను హతమార్చిన అల్లుడు
కట్నం సొమ్ము కోసం పిల్లనిచ్చిన మామనే అల్లుడు హతమార్చిన ఘటన పెదవేగి మండలం అంకన్నగూడెంలో చోటు చేసుకుంది. 8లో ▸



పోటెత్తిన భక్తులు
ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయం భక్తులతో పోటెత్తింది. కార్తీక శనివారం కావడంతో వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అన్ని విభాగాలు రద్దీగా కనిపించాయి.

ఉపాధికి దారి చూపుతున్నాయ్

ఉపాధి మార్గాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి.. నిర్మానుష్యంగా ఉండే ఊరి పొలిమేరలు రంగుల షాపింగ్ గొడుగులు, తాత్కాలిక గుడారాలతో మినీ బజార్లుగా మారుతున్నాయి.. చెట్లు, వాటి నీడలే చిరు వ్యాపారాలకు షెల్టర్లవుతున్నాయి.. సీజనల్ పండ్లు మొదలు పూలమొక్కలు, కాయగూరలు, గృహోపకరణాలు, నిత్యావసర వస్తువుల నుంచి ఉప్పు చేపల వరకు ఇక్కడ దొరుకుతున్నాయి.. సమయం, సొమ్ములు ఆదా అవుతుండటంతో ఈ దుకాణాలపై వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు.

సండే స్పెషల్

- మినీ బజార్లుగా పొలిమేరలు
- కోవిడ్ తర్వాత మారిన జీవనశైలి
- గ్రామాల మధ్య విస్తరిస్తున్న మొబైల్ వ్యాపారాలు
- రద్దీ రోడ్లలో చిరు వ్యాపారులకు ఉపాధి
- ఆసక్తి చూపుతున్న వినియోగదారులు



నరసాపురంలో పూల మొక్కల విక్రయం, (ఇన్‌సెట్‌లో) మార్టేరు రోడ్డులో అలంకరణ వస్తువులు

సాక్షి, భీమవరం : సాధారణంగా పట్టణాలు, గ్రామాల్లో రోడ్లు మార్జిన్లు, ప్లాట్‌ఫాంల వద్ద తోపుడుబండ్లు, సైకిళ్లపై చిన్నపాటి వ్యాపారులు చేస్తుంటారు. ఊరుకి ఊరికీ మధ్య ఎటువంటి వ్యాపారాలు ఉండేవి కావు. వేసవిలో కళ్లజోళ్లు, టోపీలు, శీతాకాలంలో స్వెట్టర్లు, వర్షాకాలంలో రెయిన్‌కోట్లు అలా అక్కడక్కడా రోడ్లు పక్కన అరుదుగా తాత్కాలిక దుకాణాలు కనిపించేవి. రెండేళ్ల క్రితం వచ్చిన కరోనా మహమ్మారి చాలా మంది ఉపాధి అవకాశాలను దెబ్బతీసింది. జీవనోపాధి కోసం ప్రత్యామ్నాయ అన్వేషణ కొత్త పుంతలు తొక్కింది. దీంతో చాలా మంది ఉపాధికి ఇప్పుడు రహదారి వ్యాపారాలు ఆలవాలం అవుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారు తమ ప్రాంతాల్లోని ప్రత్యేక వస్తువులతో ఇక్కడ స్టాళ్లు ఏర్పాటుచేస్తున్నారు. సరికొత్త ట్రెండ్‌తో అరుదుగా లభించే వస్తువులు, సీజనల్ పండ్లు, కూరగాయలు, శీతల పానీయాలు, స్వీట్లు, నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు, ఇతర పంటల ఉత్పత్తులు, మల్టీ మాల్స్‌లో లభించే వస్తువులు సైతం ఇప్పుడు రోడ్డు పక్కన సరికొత్తగా వెలుస్తున్న మొబైల్ దుకాణాల వద్ద దొరికేస్తున్నాయి.

రద్దీ రహదారుల్లో అధికం

ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే రహదారులు ఈ తరహా వ్యాపారాలకు అనుకూలంగా ఉంటున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం-తణుకు, పాలకొల్లు-నరసాపురం, ఉండి-ఏలూరు, తణుకు-తాడేపల్లిగూడెం హైవే తదితర రోడ్లలో గ్రామాల మధ్యలో పదుల సంఖ్యలో దుకాణాలు వెలుస్తున్నాయి. నిత్యం వ్యాపారం జరిగే అదునైన స్థలాలు కాకపోయినా సరికొత్త ఒరవడితో స్టాళ్లు ఏర్పాటుచేస్తున్నారు. రాత్రంతా నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతంలో ఉదయం పొద్దుతో పాటు కొత్త సామాన్లతో క్షణాల్లో షాపులు వెలుస్తున్నాయి. మళ్లీ సాయంత్రమయ్యే సరికి సరుకులన్నీ సర్దుకుపోగా యథాస్థానంలో ఖాళీ ప్రాంతాలై పోతున్నాయి. ఒకప్పుడు వారంతపు సంతలు, తిరునాళ్లు, తీర్థాలప్పుడు మాత్రమే ఇలాంటి దుకాణాలు పుట్టుకొచ్చేవి. ఇప్పుడు అటు షాపు నిర్వాహకులకు ఉపాధి, ఇటు ప్రయాణికులకు అందుబాటులో వస్తువులు రావడంతో ఈ వ్యాపారాలు విస్తరిస్తున్నాయి.

తక్కువ ధరకే..

షాపుల్లో కొనుగోలు చేసే వస్తువులపై అద్దె, విద్యుత్ చార్జీలు, సిబ్బంది జీతభత్యాలు ఇతర నిర్వహణ వ్యయం పడుతుంది. రోడ్ల పక్క దుకాణాల్లో అటువంటి భారం లేకపోవడంతో షాపులతో పోలిస్తే కొంచెం చౌకగానే లభిస్తున్నాయి. బిజీ లైఫ్‌లో పని ముగించుకుని హడావుడిగా ఇంటికి చేరుకునే సమయంలో వస్తువుల కోసం షాపుల వద్దకు పరుగులు తీయాల్సిన పనిలేకుండా ఇటువంటి దుకణాలు ఉపయోగపడుతున్నాయి. సమయం ఆదా కావడంతో పాటు ధరలు అనుకూలంగా ఉండటంతో ఈ దుకాణాల వద్ద కొనుగోళ్లకు వినియోగదారులు ఆసక్తి చూపిస్తున్నారు. ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళ్లే చాలా మంది ఇటీవల కాలంలో ఇటువంటి చిరు వ్యాపారాలు పెట్టుకుని బతుకు బండి సాగిస్తున్నారు. వ్యాపారాన్ని బట్టి నెలకు రూ.8 వేల నుంచి రూ.12 వేల వరకు ఆదాయం వస్తున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు.



పాలకొల్లు రోడ్డులో పండ్ల దుకాణం



భీమవరం రోడ్డులో వాయిద్య పరికరాల విక్రయం



తణుకులో రోడ్డు పక్కన వస్త్రాలు విక్రయిస్తున్న దృశ్యం

కోవిడ్ తర్వాత వలస వచ్చేశాం



మా స్వస్థలం శ్రీకాకుళం. కరోనా తర్వాత ఉపాధి కోసం పశ్చిమ గోదావరి జిల్లాకు వలస వచ్చి లంకలకోడేరులో రోడ్డు పక్కన టోపీలు, కళ్లజోళ్లతో చిరు వ్యాపారం చేసుకుని ఉపాధి పొందుతున్నాను. వ్యాపారం ఒక్కోరోజు ఒక్కోలా ఉంటుంది.

– డి.విజయ్, లంకలకోడేరు

రెండేళ్ల క్రితం దుకాణం పెట్టాను



మాది ప్రకాశం జిల్లా కాగా 15 ఏళ్ల క్రితం పాలకొల్లు వచ్చేశాం. గతంలో ఒక షాపులో పనిచేసేవాణ్ణి. కరోనా తర్వాత రెండేళ్ల క్రితం దుకాణం పెట్టుకుని మార్టేరు రోడ్డులో బెల్టులు, పర్సులు తదితర వాటిని విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నాను.

– ఎస్.శ్రీనివాసరావు, పాలకొల్లు

న్యూస్‌రీల్

ఆలయాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు

తాడేపల్లిగూడెం రూరల్: దేవదాయశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నానని, ఇప్పటివరకు దాదాపు రూ.500 కోట్లను పురాతన ఆలయాల పునరుద్ధరణకు మంజూరు చేసినట్టు డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ తెలిపారు. శనివారం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో అల్లులమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. వీరంపాలెం శ్రీబాలా త్రిపుర సుందరీ పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి పర్యవేక్షణలో బలిహరణ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంత్రి కొట్టు అమ్మవారిని తొలి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 3,200 ఆలయాలకు ఒక్కో ఆలయానికి రూ.10 లక్షల చొప్పున రూ.320 కోట్లను మంజూరు చేశామన్నారు. ఇలా ఆలయాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు, పెంటపాడు ఎంపీపీ దాసరి హైమావతి, నీలాద్రిపురం సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, నవాబుపాలెం సొసైటీ చైర్మన్ జడ్డు హరిబాబు, నాయకులు చీకట్ల మల్లేశ్వరరావు, కొండుబోయిన కృపావరం తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో ఆర్టీసీ అప్రెంటీస్ జాబితా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీలో ఐటీఐ అప్రెంటీస్ చేయడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ధ్రువీకరణ పత్రాల పరిశీలన కూడా పూర్తయిన అభ్యర్థుల జాబితాను ఆర్టీసీ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు ఆర్టీసీ విజయవాడ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఐటీఐ మార్కుల జాబితా, ఎన్‌సీవీటీ, కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డు, పాన్ కార్డు/ డ్రైవింగ్ లైసెన్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లతో ఈ నెల 29లోపు విజయవాడ విద్యాధరపురంలోని తమ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7382900299, 7330776946, 8309089998, 7382903217, 7382899018 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

3న రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

భీమవరం: పట్టణంలో జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో వచ్చేనెల 3న రాష్ట్రస్థాయి స్కూల్ పిల్లల ర్యాంకింగ్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ శనివారం తెలిపారు. అండర్ 6, 8, 10, 12, 14, 16 బాలురు, బాలికల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు ర్యాంకింగ్ పాయింట్స్‌తో పాటు మొదటి 5 ర్యాంకుల్లో నిలిచిన క్రీడాకారులు ఫిబ్రవరిలో బిహార్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 90632 24466లో సంప్రదించాలని కోరారు.

ఆరుతడి పంటలు మేలు

ఏలూరు (మెట్రో): దాళ్వాలో నీటి లభ్యత ఆధారంగా ఆరుతడి పంటలు మేలని, బోర్ల కింద వరి సాగు చేయవద్దని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై.రామకృష్ణ సూచించారు. రైతు భరోసా శిక్షణ, సందర్శన కార్యక్రమాన్ని శనివారం ఏలూరు వ్యవసాయశాఖ కార్యాలయంలో నిర్వహించారు. విజయరాయి వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కె.మోహనరావు అధ్యక్షత వహించారు. ఏలూరు జిల్లాలోని ఏడు వ్యవసాయ డివిజన్ల సహాయ వ్యవసాయ సంచాలకులు పాల్గొన్నారు. పంటలు, వాతావరణ పరిస్థితుల గురించి తెలియజేశారు. అపరాలలో విత్తనశుద్ధి ఆవశ్యకత, కలుపు యాజమాన్యం, పంట రకాల గురించి ఏలూరు ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ వి.సుజాత తెలియజేశారు.

పేదల సొంతింటి కల సాకారం



మహిళలకు ఇంటి స్థలాల పట్టాలు అందిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు ఇంటి స్థలాల పట్టాలను శనివారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 31 లక్షల మందికి జగనన్న ఇళ్ల స్థలాలు ఇచ్చి చరిత్ర సృష్టించారన్నారు. జగనన్న కాలనీల్లో స్థలాల విలువ రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఉందన్నారు. అలాగే బీ పట్టా, డీ పట్టా, జిరాయితీ, చుక్కల భూమి, ఈనాం భూములను 22 ఏ నుంచి తొలగించి శాశ్వత హక్కు కల్పించారన్నారు. ప్రతి గ్రామానికి ఎకరా భూమిని క్రైస్తవ శ్మశాన వాటికగా అందించారన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్కిల్ స్కామ్‌లో నేరస్తుడైన చంద్రబాబు మాయమాటలను ప్రజలు నమ్మడం లేదన్నారు. దత్తపుత్రుడు, ప్యాకేజీ స్టార్‌ను నమ్మి కాపు సామాజిక వర్గం మోసపోవద్దని సూచించారు. యూత్ లీడర్ కొట్టు విశాల్, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కైగాల శ్రీనివాసరావు, ఆర్డీఓ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ సంస్కరణలు విప్లవాత్మకం

జిల్లాలో 1,191 ఎకరాల పంపిణీ



ఆచంటలో భూ పట్టాలు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు, జేసీ రామసుందర్‌రెడ్డి

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న భూసంస్కరణలు విప్లవాత్మకమైనవని, 50 ఏళ్లుగా సమస్యలతో సతమతమవుతున్న పేదలకు ఊరటనిస్తున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం ఆచంటలో 928 ఎకరాలకు సంబంధించి ఏ క్లాస్, బీ క్లాస్ పట్టాలను ఆయన పంపిణీ చేశారు. పేదలకు భూ పంపిణీ చేయడం, అసైన్డ్ భూముల లబ్ధిదారులకు, లంక భూమి రైతులకు పూర్తి హక్కులు కల్పించడంలో సీఎం జగన్ మాదిరిగా దేశంలో మరే రాష్ట్రంలో ఇంతటి సాహసోపేతమైన చర్యలు తీసుకోలేదన్నారు. గోదావరి వరదల్లో లంక భూముల్లో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వలేని స్థితి ఉండేదని, ఇప్పుడు వీటి నుంచి విముక్తి కలిగిందన్నారు. పూర్తి హక్కులు కల్పించడం ద్వారా బ్యాంకు రుణాలు పొందవచ్చన్నారు. ఆచంట నియోజకవర్గంలోని సమస్యలను సీఎం జగన్‌కు విన్నవించడంతోనే భూ సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. పార్టీలకతీతంగా పారదర్శకంగా పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో సొమ్ములు చెల్లించుకోవాల్సి దుస్థితి ఉండేదని విమర్శించారు. జాయింట్ కలెక్టర్ రామసుందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 1,191 ఎకరాలను 1,704 మంది లబ్ధిదారులకు అందించామన్నారు. అలాగే గ్రామాల్లో ఎస్సీల శ్మశాన వాటికల కోసం 229 గ్రామాల్లో 139 ఎకరాల భూమి గుర్తించి కేటాయించామన్నారు. త్వరలోనే ఈనాం భూముల్లోనూ పూర్తి హక్కులు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం ఆర్డీఓ అచ్యుత అంబరీష్, పోడూరు ఎంపీపీ సబ్బితి సుమంగళి, పెనుగొండ, ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షులు దండు పద్మావతి, సుంకర సీతారామ్, సర్పంచ్‌లు కోట సరోజని వెంకటేశ్వరరావు, దిరిశాల విజయలక్ష్మి, జక్కంశెట్టి చంటి, గణేషుల శేషవేణి, కడలి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అంతర కళాశాలల పోటీలు ప్రారంభం

బ్యాడ్మింటన్, రోప్ స్కిప్పింగ్ టోర్నీ



పోటీల ప్రారంభ సభలో మాట్లాడుతున్న సత్యనారాయణరాజు

భీమవరం: పట్టణంలోని డీఎన్నార్ కళాశాలలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ అంతర కళాశాలల పురుషుల బ్యాడ్మింటన్, పురుషులు, మహిళల రోప్ స్కిప్పింగ్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలూ ఎంతో అవసరమన్నారు. తమ కళాశాలలో అత్యుత్తమ క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాలో ఉచితంగా విద్యనందిస్తున్నామన్నారు. ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు మాట్లాడుతూ విద్యార్థులు నిబద్ధతతో క్రీడా నైపుణ్యాన్ని పెంచుకుని భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాలలో అన్ని క్రీడలకు సంబంధించిన వసతులు ఉన్నాయని, వినియోగించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ బి.శాంతకుమారి, కళాశాల జాయింట్ సెక్రటరీ కె.రామకృష్ణంరాజు, సహాయ కార్యదర్శి కె.శివరామరాజు, క్రీడా పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ బీవీ నర్సింహరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ



పి.ప్రశాంతి, కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్): భారత ఎన్నికల సంఘం సూచన మేరకు వచ్చే జనవరి 1న ఫొటో ఎలక్టోరల్ రోల్స్ ఫైనల్ డ్రాఫ్ట్ పబ్లికేషన్ ప్రకటించనున్నారని కలెక్టర్ పి.ప్రశాంతి ఓ ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాలో ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ కరణకు డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్ (డీఎస్ఈ), ఫొటో సిమిలర్ ఎంట్రీస్ (పీఎస్ఈ)ను గుర్తించి సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు. 6,422 డీఎస్ఈలు, 2,29,026 పీఎస్ఈలను గుర్తించామని, వాటికి సంబంధించి జిల్లాలోని ఓటర్ల నమోదు అధికారులు, సంబంధిత వ్యక్తులకు తపాలాశాఖ ద్వారా ఫార్మేట్–ఏలో నోటీసులను జారీ చేశామని తెలిపారు. ఈ నోటీసులు అందుకున్న వారు అభ్యంతరాలు, సందేహాలు ఉంటే తహసీల్దార్ లేదా మున్సిపల్ కార్యాలయంలోని హెల్ప్‌డెస్కులో గాని అసిస్టెంట్ ఓటర్ల నమోదు అధికారులను గాని సంప్రదించాలని ఆమె సూచించారు.

విద్య, వైద్యంతో అభివృద్ధి సాధ్యం

కలెక్టర్ ప్రశాంతి



వికసిత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం అర్బన్: విద్య, వైద్యం ఉన్న చోట అభివృద్ధి సాధ్యపడుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. అనాకోడేరు సచివాలయం వద్ద శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను చిట్టచివరి లబ్ధిదారుల వరకు చేర్చేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మనబడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు సరస్వతీ నిలయాలుగా మారాయని, విద్యార్థులకు అమ్మఒడి, యూనిఫామ్స్, పుస్తకాలు తదితర వాటిని ఉచితంగా అందిస్తున్నామన్నారు. డ్వాక్రా మహిళలకు సున్నావడ్డీ, ఆసరా, రుణమాఫీ అందిస్తున్నామన్నారు. రైతులకు రైతు భరోసా, సబ్సిడీపై ఆధునిక యంత్రాలు, పంటలకు గిట్టుబాటు కల్పించేందుకు రైతు భరోసా కేంద్రాల ద్వారా సేవలందిస్తున్నామన్నారు. మత్స్యకారులకు మత్స్యకార భరోసా, ఫిష్ ఆంధ్రా యూనిట్లను సబ్సిడీపై అందిస్తున్నామన్నారు. ఇలా అన్నివర్గాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అందజేస్తున్నాయన్నారు. ప్రతిఒక్కరూ పిల్లలను చదివించేలా బాధ్యత తీసుకోవాలని సూచించారు. అనంతరం వ్యవసాయంలో లిక్విడ్ స్ప్రే చేసే డ్రోన్‌ను ప్రారంభించి పనితీరును ఆమె పరిశీలించారు. ఆర్డీఓ కె.శ్రీనివాసులురాజు, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, డీఈఓ ఆర్.వెంకటరమణ, డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు, ఎంపీడీఓ కె.వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ పడికల యేహోషువా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రసవత్తరంగా జేఎన్‌టీయూకే అంతర్ కళాశాలల పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలల మధ్య జరుగుతున్న అంతర్ కళాశాలల క్రీడా పోటీలు, యూనివర్సిటీ జట్ల ఎంపికలు రసవత్తరంగా జరుగుతున్నాయి. స్థానిక సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఈ పోటీల రెండో రోజు శనివారం బాలురు, బాలికల జట్ల మధ్య వివిధ క్రీడా పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో భాగంగా మహిళల వాలీబాల్ ఫైనల్ పోటీలో గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల జట్టు సెయింట్ మేరీస్ జట్టును 25–12, 25–17 తేడాతో ఓడించి విజేతగా నిలిచింది. నెట్‌బాల్ పురుషుల విభాగంలో జరిగిన తుది పోరులో పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల జట్టు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల జట్టుపై 15– 8 తేడాతో విజయం సాధించింది. త్రోబాల్ మహిళల విభాగంలో కాకినాడ జేఎన్‌టీయూ జట్టు రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల జట్టుతో తలపడుతుంది. షటిల్ బ్యాడ్మింటన్ మహిళ డబుల్స్‌లో భీమవరం శ్రీ విష్ణు ఇంజినీరింగ్ కళాశాల జట్టు భీమవరం ఎస్ఆర్‌కేఆర్ జట్టును 21–19 తేడాతో ఓడించింది. సింగిల్స్ విభాగంలో శ్రీవిష్ణు ఇంజినీరింగ్ విద్యార్థిని ఎస్ఆర్‌కేఆర్ విద్యార్థినిపై 21–6 తేడాతో ఓడించి విజేతగా నిలిచింది.

బైక్ చోరీలు చేస్తున్న ఇద్దరు యువకుల అరెస్ట్

భీమడోలు: చెడు వ్యసనాలకు బానిసైన ఇద్దరు యువకులు మోటార్ బైక్‌లను చోరీ చేసి పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి బైక్‌లను కొనుగోలు చేసిన మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. భీమడోలుకు చెందిన అద్దాల ప్రవీణ్, కొమ్ముల శేఖర్ వ్యసనాలకు బానిసలై దొంగతనాలు చేస్తున్నారు. వీరిద్దరు భీమడోలు, చేబ్రోలు, గణపవరం మండలాల్లో మూడు చోట్ల మూడు మోటార్ బైక్‌లు దొంగతనం చేశారు. అలాగే ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి భీమడోలు గణపతి సెంటర్‌లోని చైత్ర మెడికల్ స్టోర్ షట్టర్ తాళాలు పగుల కొట్టి అందులోని ఒక సెల్ ఫోన్‌తో పాటు రూ.1000లు నగదును దొంగించి పరారయ్యారు. నిందితుల కదలికలపై నిఘా ఉంచిన భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ వారిని చాకచక్యంగా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు మోటార్ బైక్‌లు, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన మోటార్ బైక్‌లను కొనుగోలు చేసిన కుర్లెళ్లగూడెంకు చెందిన తాటికోట కొండలరావుని కూడా అరెస్ట్ చేశారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

ప్రణాళిక, నిరంతర సాధనతోనే విజయం

- సీఎస్‌బీ అకాడమీ డైరెక్టర్ బాలాలత
- సాక్షి ఆధ్వర్యంలో గ్రూప్ 1, 2 అవగాహన సదస్సు
- పెద్ద ఎత్తున హాజరైన ఉద్యోగార్థులు





ఏలూరులో గ్రూప్–1, 2 పరీక్షల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఎస్‌బీ అకాడమీ డైరెక్టర్ బాలాలత, సదస్సుకు హాజరైన యువతీయువకులు

ఏలూరు రూరల్: సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో శనివారం ఏలూరులో నిర్వహించిన గ్రూప్–1, 2 పరీక్షల అవగాహన సదస్సుకు విశేష స్పందన వచ్చింది. స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి ఏలూరు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో యువత హాజరయ్యారు. హైదరాబాద్ సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలాలత గ్రూప్ పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులకు అనేక విషయాలు బోధించారు. సదస్సులో ఆమె మాట్లాడుతూ గ్రూప్ 1, 2 పరీక్షల్లో విజయం సాధించాలంటే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. ప్రణాళికతో పాటు కఠోర సాధన చేస్తే తప్పక విజయం వరిస్తుందన్నారు. ఒత్తిడితో పాటు గ్రూప్ పరీక్షలపై భయాన్ని విడనాడాలన్నారు. ముఖ్యంగా కోచింగ్ సెంటర్స్‌కు వెళితే నువ్వు గ్రూప్స్ రాయగలవా? నీ వల్ల అవుతుందా? అంటూ అనేక ప్రశ్నలతో మిమ్మల్ని భయపెట్టే వారు ఉంటారని గుర్తు చేశారు. అలాంటి వారిని లెక్క చేయకూడదని సూచించారు. పోలియో బారిన పడి నడవలేని స్థితిలో ఉన్న తాను ఇలాంటి ప్రశ్నలు, అనుమానాలు ఎదుర్కొని ముందుకు నడిచానన్నారు. 2004లో ఆలిండియా సివిల్స్‌లో 399 ర్యాంక్, 2016లో 167వ ర్యాంక్ సాధించానని చెప్పారు. చదువుతోనే మన తలరాత మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ ఫ్యాకల్టీ ప్రవీణ్, నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ కొండా రవి, పశ్చిమగోదావరి జిల్లా సాక్షి కార్యాలయ మేనేజర్ వీవీ శివుడు, హేలాపురి బాలోత్సవం ఉపాధ్యక్షుడు వి.ఆనందనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాలాలత సూచనలివే..

- రీజినల్, నేషనల్, ఇంటర్నేషనల్ స్థాయిలో రివర్స్ ఇంజినీరింగ్ ద్వారా కరెంట్ ఎఫైర్స్ అంశంలో జరిగిన సంఘటనలపై లోతుగా పరిశీలించాలి. ఉదాహరణకు ఉత్తర కాశీలో టన్నెల్ కూలిపోవడం, ఖలిస్తాన్ ఉద్యమం, కెనడా–ఇండియా డిప్లమాటిక్ సమస్య డీప్‌ఫేక్, స్పేస్ఎక్స్ తదితర కరెంట్ ఎఫైర్స్‌పై పరీక్షల్లో వచ్చే ప్రశ్నలకు సరైన ఆన్సర్ చేయాలంటే అనుబంధ అంశాలపై సైతం లోతైన పరిశీలన చేయాలి.
- ఆరో తరగతి నుంచి 12వ తరగతి పాఠ్య పుస్తకాలు చదివి చరిత్ర, పాలిటిక్స్, భక్తి, ఫిలాసఫీ, మతం, సైన్స్, పుస్తకాలు, మానవ అభివృద్ధితో పాటు రాజ్యాంగం, సోషల్ ఇష్యూస్‌పై అవగాహన పెంచుకోవాలి.
- సేకరించిన విషయాలను మళ్లీ అవగతం చేసుకునేందుకు ఒక నోట్‌బుక్‌లో రాసుకుని, రివిజన్ చేయాలి. పోటీ పరీక్షల్లో వస్తున్న ప్రశ్నలు ఏటా పెరుగుతున్నందు వల్ల అందుకు అనుగుణంగా నోట్స్ ప్రిపేర్ చేసుకోవాలి.
- రోజుకు కనీసం 8 గంటల పాటు చదువుకోవాలి. 2 నుంచి 3 గంటల పాటు మోడల్ పేపర్లు ప్రాక్టీస్ చేయాలి. రివర్స్ ఇంజినీరింగ్ విధానంలో ప్రశ్నలు తయారు చేసుకుంటే మంచిది.

చాలా విలువైన సదస్సు



నేను పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నాను. బాలాలత మేడం వస్తున్నారని తెలిసి వచ్చాను. ఆమె సూచనలు ఎంతో విలువైనవి. గ్రూప్స్‌లో విజయం సాధించాలంటే ఎలాంటి ప్రణాళికతో సిద్ధం కావాలో ఇప్పుడు మరింత స్పష్టత వచ్చింది. ఎంతో విలువైన సదస్సు ఏర్పాటుచేసినందుకు సాక్షి మీడియా వారికి కృతజ్ఞతలు.

– ఉప్పాల సైలాస్, తాడేపల్లిగూడెం

కొత్త విషయాలు తెలుసుకున్నా



గ్రూప్స్ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో? తెలిసింది. ప్రధానంగా కరెంట్ ఎఫైర్స్‌పై లోతైన అధ్యయనం ఎలా చేయాలి? ఇందుకోసం ఎలాంటి అంశాలు పరిశీలించాలి? నోట్స్ ఎలా సిద్ధం చేసుకోవాలో? బాలాలత స్పష్టంగా చెప్పారు. ఇది ఎంతో విలువైన సమాచారం. ఇలాంటి సదస్సుకు హాజరుకావడం వల్ల ఎన్నో విలువైన విషయాలు తెలుసుకోవచ్చు.

– ఐ.జయప్రద, తాడేపల్లిగూడెం

ఎన్నడూ ఇలాంటి సదస్సుకు రాలేదు



గ్రూప్స్ పరీక్షలపై గతంలో ఎవ్వరూ ఇలాంటి సదస్సులు పెట్టలేదు. ఇలాంటి సదస్సుల వల్ల యువతకు ఎంతో మేలు జరుగుతుంది. గ్రూప్స్ పరీక్షలపై నాలో కలిగిన అనుమానాలకు ఈ సదస్సు నుంచి సమాధానం వచ్చింది. సాక్షి పేపర్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు.

– ఎస్.జ్యోతి, రామాయగూడెం

స్ఫూర్తి నింపింది



సదస్సు వల్ల నాలో భయం పోయింది. మరింత ధైర్యం వచ్చింది. గ్రూప్స్‌కు ఎలా ప్రిపేర్ కావాలో? తెలిసింది. నేనే కాదు నాలాంటి వారు ఎందరో గ్రూప్స్‌లో విజయం సాధించారని తెలుసుకున్నాను. ఈ కార్యక్రమం నాకు చాలా మేలు చేసింది. మరింత కఠోర సాధన చేస్తాను. తప్పక విజయం సాధిస్తాను. థాంక్యూ సాక్షి.

– వేమలు దుర్గ, ఏలూరు

ఆస్తి కోసం పిన్ని హత్య

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఆస్తి కోసం పిన్నికి పిట్టల మందు ఇచ్చి కొడుకు హత్య చేసిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొల్లపర్రు గ్రామానికి చెందిన అండ్రాజు మద్దూరమ్మ (56) తన పుట్టిల్లు తోకతిప్పలో తన తల్లిదండ్రులు కట్నంగా కింద సెంటు స్థలాన్ని ఇచ్చారు. మద్దూరమ్మకు కూతురు ఉండగా కొన్నాళ్లకు భర్త వదిలేయడంతో పుట్టిల్లయిన తోకతిప్ప గ్రామంలో తన తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. తనతో పాటు ముగ్గురు అక్కా చెల్లెల్లకు నాలుగు సెంట్లు స్థలాన్ని కట్నాలుగా తల్లిదండ్రులు ఇచ్చారు. రెండో అక్క కుమారుడు రామాని నాగార్జున పిన్ని, పెద్దమ్మలకు సెంటుకు రూ. 70 వేలు చొప్పున ఇచ్చి ఆస్తి తన చేజిక్కించేందుకు ప్రయత్నించడంతో గొడవకు దారితీసింది. ఈ నేపథ్యంలో రామాని నాగార్జున కూల్‌డ్రింక్‌లో పిట్టల మందు కలిపి పిన్ని అండ్రాజు మద్దూరమ్మకు ఇవ్వడంతో ఆమె పక్కింటికెళ్లి కాళ్లు చేతులు వంకర లాగుతున్నాయి. తనకేదో కలిపేసి ఇచ్చాడంటూ స్పృహ తప్పి పడిపోయింది. ఆర్ఎంపీ డాక్టర్‌ని తీసుకువచ్చి చూపించగా సీరియస్‌గా ఉందని భీమవరం తీసుకెళ్లమని సూచించాడు. ఈ నేపథ్యంలో కొద్ది సేపటికే అండ్రాజు మద్దూరమ్మ మృతి చెందింది. ఆమె కుమార్తె మైలా వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సై బి.మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మామను హతమార్చిన అల్లుడు

పెదవేగి: ఏలూరు జిల్లా పెదవేగి మండలం అంకన్నగూడెంలో దారుణం చోటు చేసుకుంది. కట్నం సొమ్ము కోసం పిల్లనిచ్చిన మామనే ఓ అల్లుడు హత్య చేశాడు. పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం అంకన్నగూడేనికి చెందిన మరీదు సీతారామాంజనేయులు కొప్పాకలో టైలరింగ్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతని కుమార్తె లక్ష్మీకుమారిని అదే గ్రామానికి చెందిన కట్టా సుబ్బారావు కుమారుడు నవ్యసాయికి ఇచ్చి నాలుగేళ్ల క్రితం వివాహం చేశాడు. వివాహ సమయంలో కట్నం కింద కొంత నగదును ఇచ్చారు. ఐదేళ్ల తర్వాత భూమికూడా ఇస్తానని చెప్పాడు. కానీ ఆ భూమి ఇప్పుడే ఇవ్వాలని నవ్యసాయి కుటుంబ సభ్యులు పట్టుపడుతుండడంతో ఇరు కుటుంబాల మధ్య కొంతకాలంగా వివాదం జరుగుతోంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన నవ్యసాయి భార్య లక్ష్మీకుమారిని గత నెలలో పుట్టింట్లో వదిలి వెళ్లాడు. తిరిగి 20 రోజుల కిందట గ్రామానికి వచ్చి ఇంటికి వెళ్లాలంటే కట్నం కింద ఇస్తామన్న భూమిని రాయించుకుని రమ్మని చెప్పాడు. దీనికి సీతారామాంజనేయులు అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం అంకన్నగూడెం నుంచి కొప్పాకలోని తన టైలరింగ్ దుకాణానికి వెళ్లిన సీతారామాంజనేయులు తిరిగి పది గంటల సమయంలో ఇంటికి తిరిగొస్తున్నాడు. తన ఇంటికి వెళ్లే దారిలో వియ్యంకుడైన కట్టా సుబ్బారావు ఇల్లు ఉంది. ఆ ఇంటి మీదుగా వెళ్తుండగా అల్లుడు నవ్యసాయి, అతని తండ్రి కట్టా సుబ్బారావు, అతని తల్లి విజయకుమారి కలిసి సీతారామాంజనేయులుపై కత్తితో దాడి చేశారు. తీవ్ర రక్తస్రావంతో పడిపోయిన అతనిని గ్రామస్తులు ద్విచక్రవాహనంపై ఏలూరు సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సీతారామాంజనేయులు (51) మృతి చెందాడు. ఈ ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేశామని, నిందితులు పరారీలో ఉన్నారని పెదవేగి సీఐ కొండవీటి శ్రీనివాస కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారని ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.



సీతారామాంజనేయులు మృతదేహం

దొంగతనం కేసుల్లో ఆభరణాల స్వాధీనం

భీమవరం: జిల్లాలోని పాలకొల్లు రూరల్, యలమంచిలి పోలీసు స్టేషన్స్ పరిధిలో రెండు దొంగతనం కేసుల్లో ముద్దాయిలను అరెస్టు చేసి వారి నుంచి రూ. 6.50 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ యు.రవి ప్రకాష్ చెప్పారు. శనివారం భీమవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పాలకొల్లు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు మైనర్ బాలుర నుంచి సుమారు 58 గ్రాముల బంగారు ఆభరణాలతోపాటు రూ.18,560 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. యలమంచిలి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనం కేసులో అబ్బిరాజుపాలెం గ్రామానికి చెందిన తాళ్ల తులసీరావును అరెస్టు చేసి అతని వద్దనుంచి సుమారు 44 గ్రాముల బంగారు ఆభరణాలు, కొన్ని వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసులను ఛేదించిన నరసాపురం ఇన్‌చార్జ్ డీఎస్పీ జి.పైడేశ్వరరావు, పాలకొల్లు రూరల్ సీఐ కె.సతీష్, ఎస్సై ఎస్.శ్రీనివాసు, యలమంచిలి ఎస్సై జేఎస్‌వీ ప్రసాద్, పోడూరు ఎస్సై డి.రామ్‌కుమార్‌లకు రివార్డులు అందించారు.



రికవరీ చేసిన బంగారు ఆభరణాలను చూపుతున్న ఎస్పీ రవిప్రకాష్

సెల్‌ఫోన్స్ రికవరీ

జిల్లాలోని సెల్‌ఫోన్ ట్రాకింగ్ బృందం ఆరవ విడతగా రూ. 22.95 లక్షల విలువైన 153 సెల్ ఫోన్స్ రికవరీ చేసినట్లు ఎస్పీ రవిప్రకాష్ చెప్పారు. సెల్‌ఫోన్స్ పోగొట్టుకున్న బాధితులకు శనివారం భీమవరం సెల్‌ఫోన్స్ అందించిన సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎవరికైన సెల్‌ఫోన్ దొరికితే సొంతానికి వాడుకోకుండా దగ్గరలోని పోలీసుస్టేషన్స్ అప్పగించాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బిల్లులు లేని సెల్‌ఫోన్స్ కొనుగోలు చేస్తే ఇబ్బందులు తప్పవన్నారు. సెల్‌ఫోన్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా ఇప్పటి వరకు సుమారు రూ.1.43 కోట్లు విలువైన 954 సెల్‌ఫోన్స్ రికవరీ చేశామన్నారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే 91549 66503 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. అనంతరం సెల్‌ఫోన్స్ రికవరికీ సేవలందించిన ఎస్సై సీహెచ్ విజయలక్ష్మి, ఏఎస్సై డి.రత్నారెడ్డి, కానిస్టేబుల్స్ వీజీ శేషకుమార్, బి శ్రీనివాస్, ఎస్ రమేష్‌బాబు, కె పాపారావు, కె ప్రసాద్‌బాబు, సుధారాణి, భాస్కర్‌లను ఎస్పీ రవిప్రకాష్ అభినందించి రివార్డులను అందజేశారు.

పెనుగొండలో బాలిక అదృశ్యం

పెనుగొండ: పెనుగొండలో ఇరగవరం మండలం కంతేరు గ్రామానికి చెందిన ఓ బాలిక శనివారం సాయంత్రం అదృశ్యమైంది. కంతేరుకు చెందిన మామిడి ప్రసన్న కుమార్ కుమార్తె ఐశ్వర్య పెనుగొండ భాష్యం పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. పెనుగొండ నుంచి కంతేరుకు పాఠశాలకు చెందిన బస్సులో వెళుతూ ఉండేది. అయితే తండ్రి ప్రసన్నకుమార్‌కు పెనుగొండ యూనియన్ బ్యాంక్ వద్ద దుకాణం ఉండడంతో అప్పుడప్పుడు పెనుగొండ గాంధీ బొమ్మల సెంటర్ బస్సు దిగి తండ్రి వద్దవకు వెళ్తూ ఉండేది. ఈ కోవలోనే శనివారం పాఠశాల ముగిసిన అనంతరం తండ్రి షాపు వద్దకు రమ్మని చెప్పినట్లు స్నేహితులకు చెప్పి గాంధీ బొమ్మల సెంటర్‌లో బస్సు దిగిపోయింది. అయితే తండ్రి వద్దకు ఎంతకూ వెళ్లకపోవడంతో కంగారుపడి పాఠశాల వద్ద, ఇతర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పెనుగొండ ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్ కేసు నమోదు చేశారు. బాలిక వివరాలు తెలిస్తే 94407 96679 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. పెనుగొండ గాంధీ బొమ్మల సెంటర్‌లో సీసీ పుటేజీలో బాలిక నడచి వెళ్తున్నట్లుగా నమోదైంది.

భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం భార్యభర్తల గొడవల నేపథ్యంలో భర్త ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దిరుసుమర్రు గ్రామానికి ఆకురాతి వెంకటేష్ (35) తన భార్య జ్యోతికి గతంలో వరకట్నం విషయంలో గొడవలు ఉండడంతో ఆమె పుట్టింట్లో ఉంటుంది. ఈ నేపథ్యంలో శనివారం ఈ విషయమై మనస్థాపం చెందిన ఆకురాతి వెంకటేష్ ఉరి వేసుకుని మృతి చెందాడు. వెంకటేష్ తల్లి ఆకురాతి సూర్యకాంతం ఫిర్యాదు మేరకు ఎస్సై బి.మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడప గడపకు సంక్షేమం



ఆకివీడు : అయిభీమవరంలో శనివారం సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

క్లుప్తంగా

జగనన్న భూహక్కు- భూరక్షను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జీవీ శేషగిరిరావు

పెంటపాడు: రైతుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న భూహక్కు- భూరక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ జీవీ శేషగిరిరావు పేర్కొన్నారు. వల్లూరుపల్లి గ్రామంలో జగనన్న భూరక్ష- భూహక్కు కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దంగేటి రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు రైతులు అడిగిన సందేహాలను రెవిన్యూ అధికారులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు దెయ్యం అన్నవరం, సొసైటీ అధ్యక్షుడు కుంచే సుబ్రహ్మణ్యం, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో కొమరవరం విద్యార్థి ప్రతిభ



అనూషను అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు

తణుకు టౌన్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14 విభాగంలో కబడ్డీలో రాష్ట్ర జట్టుకు తణుకు రూరల్ మండలం కొమరవరం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ టి.అనూష ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు టీ.రవి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఎస్ వెంకటలక్ష్మీ మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఇప్పటికే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికైన అనూషను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కరిబండి రాజేశ్, సొసైటీ అధ్యక్షుడు నిమ్మకాయల సురేష్ బాబు, ఎంపీటీసీ సభ్యులు ఎం సుబ్బారావు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరాల వెంకన్నకు పూజలు



ఈడూరులో విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ నిర్వహించారు. ఉదయం అర్చనలు జరిపి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా కార్తీక మాస పూజలు



వీరేశ్వరస్వామి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పెంటపాడు: కార్తీక మాసం పురస్కరించుకొని మీనవిల్లూరులో ప్రసిద్ధి చెందిన వీరేశ్వర స్వామి ఆలయంలో శనివారం లక్షబిల్వార్చన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. తొలుత స్వామివారికి పలు రకాల ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం లక్షపత్రిపూజ నిర్వహించారు.

గ్రీన్ ఎనర్జీ టెక్నాలజీతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం

తాడేపల్లిగూడెం : గ్రీన్ ఎనర్జీ టెక్నాలజీతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో వక్తలు పేర్కొన్నారు. ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ట్రెనింగ్ అండ్ లెర్నింగ్ అకాడమీ సహకారంతో వారం రోజులుగా సాగుతున్న కార్యక్రమం శనివారం ముగిసింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐఐటీ భువనేశ్వర్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస భాస్కరన్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పెరిగిపోతున్న పర్యావరణ కాలుష్యం వల్ల మానవాళి ఇబ్బంది పడుతుందన్నారు. వాయు కాలుష్యాన్ని నిర్మూలించే దిశగా పర్యావరణ సమతుల్యానికి పాటుపడాలన్నారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే పేదల అభ్యున్నతి

- తణుకులో జోరుగా వై ఏపీ నీడ్స్ జగన్..
- పేదింట సంక్షేమం పారదర్శకంగా అందాలంటే మళ్లీ జగనే రావాలి...

తణుకు అర్బన్: పేదింట అనారోగ్య సమస్యలకు ఖరీదైన ఉచిత వైద్యం అందాలన్నా.. పేదింటి బిడ్డలు ఉన్నత విద్య ఉచితంగా అభ్యసించాలన్నా, పేద వృద్ధులకు ఇంటి గుమ్మంలోకే పింఛన్లు అందాలన్నా, పేదింటి అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందాలంటే ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాల్సిందేనంటూ ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ పేరిట ఈనెల 9వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించిన ఈ కార్యక్రమం తణుకు నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది. నియోజకవర్గంలోని తణుకు మున్సిపాల్టీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో ఈ కార్యక్రమం పార్టీ నాయకులు ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్తున్నారు. ముందుగా ఒక ప్రాంతంలో సమావేశం నిర్వహించి, ఆ సచివాలయం వద్ద సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూపిస్తూ పట్టిక ఆవిష్కరణ, అనంతరం అదే ప్రాంతానికి సంబంధించి జెండా స్థూపాన్ని ఆవిష్కరించి ప్రజల ఇంటి గుమ్మంలోకి వెళ్లి ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటూ ప్రజలకు వేస్తున్న ప్రశ్నలకు ప్రజానీకం జగనే రావాలి.. జగనే కావాలంటూ కోరుకుంటున్నారు.



తణుకులో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి (ఫైల్)

తణుకులో కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి కారుమూరి..

రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ముందుగా తణుకు మున్సిపాల్టీ పరిధిలోని 5వ వార్డులో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతిరోజు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో పార్టీ నాయకులు,ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తూ ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకుంటున్నారు.



తణుకు 9వ వార్డులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి. (ఫైల్)

జగన్‌కు పదికి పది మార్కులు వేస్తున్న ప్రజానీకం



ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో తణుకు నియోజకవర్గంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం. రాష్ట్ర మంత్రివర్యులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ప్రతిరోజూ ప్రజల్లోనే ఉంటూ వారి అభిప్రాయాన్ని తెలుసుకుంటున్నాం. ప్రజలంతా మరలా జగన్‌కే పట్టం కడుతామంటూ పదికి పది మార్కులు వేస్తామని చెబుతుండడం సంతోషంగా ఉంది.

– యిండుగపల్లి బలరామకృష్ణ, తణుకు పట్టణ జేసీఎస్ కన్వీనర్

జగన్‌కు రుణపడి ఉంటాం



గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాము. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుంటాం. పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న తీరు అభినందనీయం.

– వి.రాణి, తణుకు

ఇటువంటి ముఖ్యమంత్రిని నేనెప్పుడూ చూడలేదు



జగన్‌లాంటి ముఖ్యమంత్రిని గతంలో నేనెప్పుడూ చూడలేదు. ఏ పథకమైనా ఎటువంటి అవినీతి లేకుండా పారదర్శకంగా మాకు అందుతుంది. గత టీడీపీ హయాంలో డబ్బులిస్తేనే లబ్ధి అందేది. మళ్లీ జగన్‌నే ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటాం.

– తణుకు ముత్యాలు, తణుకు

అంబేడ్కర్ ఆశయాలను అందిపుచ్చుకోవాలి



తణుకు అర్బన్: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు పీఎస్‌డీ ప్రసాద్



తణుకు టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు, ఆలోచనా విధానాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని తహసీల్దారు పీఎస్‌డీ ప్రసాద్ అన్నారు. ఆల్ ఇండియా పూలే అంబేడ్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక 3వ నంబరు మున్సిపల్ పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తహసీల్దారు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, ఫౌండేషన్ వ్యవస్థాపకులు, న్యాయవాది పొట్ల సురేష్, అభిషేక్, విప్పర్తి రాజశేఖర్, పాఠశాల హెచ్‌ఎం రాజ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన అవసరం

తణుకు టౌన్: భారత రాజ్యాంగం పట్ల విద్యార్థులు కనీస అవగాహన కలిగి ఉండాలని తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకులు ఎస్ విష్ణువర్ధన్ చెప్పారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన భారత రాజ్యాంగం గురించి విద్యార్థులకు వివరించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

తణుకు అర్బన్: సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత అన్నారు. లా డే, వరకట్న వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం తణుకు బార్ అసోసియేషన్ హాల్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ అధ్యక్షతన నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడారు. వరకట్నం తీసుకోవడం నేరమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలని సూచించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సదస్సులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరాం, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పీవీ రంజిత్‌కుమార్, స్పెషల్ మేజిస్ట్రేట్ పీఎస్‌పీ చిరంజీవిరావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణమూర్తి, న్యాయవాదులు కె.వెంకటేశ్వర్లు, కె.మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.



తణుకులో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయమూర్తి కె.కృష్ణసత్యలత, తదితరులు

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

తణుకు టౌన్: ఓటు హక్కుకు అర్హతలు కలిగిన విద్యార్థినీ, విద్యార్థులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి జెడ్ వెంకటేశ్వరరావు కోరారు. ప్రత్యేక ఓటరు నమోదు, అవగాహనా కార్యక్రమం (స్వీప్) కార్యక్రమంలో భాగంగా శనివారం తణుకులోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తణుకులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులతో పట్టణంలో ఓటరు నమోదుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్, ఎంపీడీవో కె కిరణ్ కుమార్, పట్టణ సీఐలు నాగరాజు, సీహెచ్ ఆంజనేయులు, టౌన్ ప్లానింగ్ అధికారి వై శ్రీనివాసు, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ బీ సూర్యనారాయణ రాజు, తదితరులు పాల్గొన్నారు.



తణుకులో ఓటరు నమోదుపై అవగాహనా ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

గోపినాథపట్నంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు

ఉంగుటూరు: గోపినాథపట్నంలో సోమవారం నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవదాయ ధర్మాదాయ శాఖమంత్రి, ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మంత్రి కొట్టు సత్యనారాయణ తండ్రి దివంగత కొట్టు వెంకటేశ్వరరావు, సరస్వతి దంపతులు ఈ ఆలయాన్ని ఆరు దశాబ్దాల క్రితం నిర్మించారు. ఈక్షేత్రంలో ఏటా ముక్కోటి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. చేబ్రోలు-దూబచర్ల రహదారిని ఆనుకుని ఉన్న ఈ ఆలయాన్ని పునర్నిర్మించి అనేక విగ్రహాలను, గీతా మందిరాలను నూతనంగా నిర్మించారు. ఈ ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా వర్ధిల్లాలని కొట్టు వెంకటేశ్వరరావు ఆకాంక్షను నెరవేర్చేందుకు ఆయన కుటుంబసభ్యులు ఈ ఆలయం పునర్నిర్మాణం చేపట్టారు. శుక్రవారం 1వ తేదీ ఉదయం 10.21 గంటలకు శుభముహూర్తాన దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, సాదిని కుమారి దంపతులతో విగ్రహ ప్రతిష్ఠ జరగనుందని నిర్వాహకులు తెలిపారు. అన్నసమారాధనకు ఏర్పాట్లు చేశారు.



గోపినాథపట్నంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయం

వృద్ధులకు బియ్యం పంపిణీ

తణుకు టౌన్: పట్టణంలో ఎన్‌సీసీ 75వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా తణుకులోని మహిళా కళాశాల ఎన్‌సీసీ కేడెట్‌ల ఆధ్వర్యంలో ఎన్‌సీసీ కేడెట్‌లు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ యూ లక్ష్మీసుందరి బాయి ఆధ్వర్యంలో పట్టణంలోని కళాశాల నుంచి నరేంద్ర సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్‌సీసీ డే సందర్భంగా కేడెట్‌లు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని సంధ్యా జ్యోతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బియ్యం, పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె రామకృష్ణ, ఎన్‌సీసీ అధికారులు పీఎస్‌వీ రవీంద్ర, స్వామి, సంజయ్‌గాంధీ, ఎన్‌సీసీ కేడెట్‌లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

రెల్లి కులస్తులకు శ్మశానవాటిక కేటాయింపు



రెల్లి కులస్తులకు సర్వేచేసిన పట్టాను అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: మండలంలోని పెంటపాడు గ్రామంలో రెల్లి కులస్తులకు ఎంతో కాలం నుంచి శ్మశాన వాటికకు స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా శనివారం రెల్లి కులస్తులకు 10 సెంట్ల స్థలం పట్టాను వారికి మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద అందజేశారు. ఈ సందర్భంగా రెల్లి కులసంఘ నాయకుడు తాడికొండ ఏసు మాట్లాడుతూ శ్మశాన వాటికలకు భూమి ఇచ్చేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, పెంటపాడు గ్రామ సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వద్దాది మధుసూదన్, కమ్యూనిస్టు నాయకులు కళింగ లక్ష్మణరావు, ధనాల శంకర్, బౌరిశెట్టి శ్రీను, దనాల దానయ్య, టి. జయరాం, బి. లక్ష్మి, తదతరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

తణుకు టౌన్: మండలంలోని జగనన్న కాలనీల్లో రెండు వారాల్లో 80 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసే విధంగా ఇంజనీరింగ్ సిబ్బంది పని చేయాలని మండల గృహ నిర్మాణ ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు కోరారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలోని పెదపాటి చెరువు వద్ద గల 1, 2, 3, జగనన్న లేవుట్‌లోని ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులకు, సిబ్బంది పలు సూచనలు చేశారు. అనంతరం ఇంజనీరింగ్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. వచ్చే వారం నాటికి 25 ఇళ్లను పూర్తి చేయాలనే లక్ష్యంతో సిబ్బంది పని చేయాలని కోరారు. ఇళ్ల నిర్మాణంలో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. ఈకార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ ఎస్ వెంకటరెడ్డి, ఇంజనీరింగ్ సిబ్బంది, పాల్గొన్నారు.

ఆడపిల్లలు చదువులో ముందుండాలి



కృష్ణాయపాలెం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఆడపిల్లలు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే ప్రతి ఒక్కరూ విద్యనభ్యసించాలని ఎంఈవో-2 పీఎంకే.జ్యోతి అన్నారు. శనివారం మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో భేటీ బచావో - భేటీ పడావో మండల స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో జ్యోతి మాట్లాడుతూ ఆడపిల్లలు చదువులో ముందుండాలని సూచించారు. ఆడపిల్ల చదువుకుంటే ఇంటికి వెలుగునిస్తుందన్నారు. తొలుత అసెంబ్లీ నిర్వహించి, వీర మహిళ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కనకదుర్గ, ఉపాధ్యాయులు సీఆర్‌పీలు, పీసీ కమిటి సభ్యులు, మెడికల్, హెల్త్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

షేక్ లాల్‌కు సత్కారం



ఏలూరులో షేక్ లాల్‌ను సత్కరిస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి

తణుకు అర్బన్: ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీలకు సంబంధించి తణుకు డిపో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో కొనసాగుతున్న నేపథ్యంలో తణుకు డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ లాల్‌ను ఏపీఎస్‌ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ ఎ.రాజారెడ్డి సత్కరించారు. డోర్ డెలివరీ మాసోత్సవాల్లో భాగంగా ఏలూరు ఏపీఎస్ ఆర్టీసీ గ్యారేజ్ ఆవరణలో శనివారం నిర్వహించిన డోర్ డెలివరీ గేట్ మీటింగ్‌లో తనకు ఈ సత్కారం దక్కినట్లు లాల్ వివరించారు.

వాసవి వనిత క్లబ్ సేవలు అభినందనీయం



భవిత సెంటర్‌లో సేవా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో వాసవి వనిత క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక సుబ్బారావుపేట దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్లబ్ అధ్యక్షురాలు అచ్యుత లక్ష్మి ఆధ్వర్యంలో బిస్కెట్స్, చాక్లెట్స్, పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.మంగ, గంగరాజు, క్లబ్ సెక్రటరీ స్వర్ణకాంతి, ట్రెజరర్ ప్రభ, ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య, కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బస్ కాంప్లెక్స్‌లోకి ఎక్స్‌ప్రెస్ బస్సులు రాకపోవడంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారని, బస్సులు కాంప్లెక్స్‌లోకి వచ్చే విధంగా ప్రజా గళం విన్పించేందుకు వీలుగా రౌండ్ టేబుల్ సమావేశం ఈ నెల 26వ తేదీ 11 గంటలకు మండల పరిషత్తు కార్యాలయం (ఎండీఓ) సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక సభ్యులు తెలిపారు. ప్రజలు జయప్రదం చేయాలని కోరారు.